

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

యశోద.. తన జీవితం, తన సర్వస్వం.

ఆమె పేరు తల్చుకోగానే ఆయన మనసంతా తెలియని ఉద్వేగంతో నిండిపోయింది.

తన యశోద..

తనని తనకి పరిచయం చేసిన యశోద.

తన సోల్ మేట్.

తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధమే అయినా ప్రేమ పెళ్ళికేమీ తక్కువగా జరగలేదు తమ వివాహం. అనుకుంటూనే గతంలోకి జారుకున్నారు ఆయన.

'అన్నయ్యా, మన చంటి బావ వాళ్ళ దూరపు చుట్టాలమ్మాయి సంబంధం ఉంది. పిల్ల చక్కగా ఉంటుంది, చదువుకుంటోంది. మనంత స్థితిమంతులు కాదు గానీ మంచి కుటుంబం, మన కేశవుడికి బావుంటుంది అనిపిస్తోంది. నీకూ వదినకి అభ్యంతరం లేకపోతే' అన్న తన మేనత్త చంద్రకళ మాటలకి సరదా పడ్డారు కేశవ్ తల్లితండ్రులు.

తన చదువు పూర్తి చేసుకుని కుటుంబ వ్యాపారాల బాధ్యతలని తలకెత్తుకుని, ఎంతో సమర్థవంతంగా రాణిస్తున్న తమ ఒక్కగానొక్క కొడుక్కి సంబంధాలు చూస్తున్న వారికి ఆ మాటలెంతో నచ్చాయి.

" అదేమిటి చంద్రా, స్థితి గురించి ఎందుకు? మనింటికి వస్తే మనవన్నీ ఆ అమ్మాయివే కదా, మంచివాళ్ళు, మనలో కలిసే వాళ్ళు అవడం ముఖ్యం కదా! " అంది అమ్మ.

“అవును చంద్రా, మీ వదిన చెప్పిన మాట నిజం కుటుంబం మంచిదయ్యి, అమ్మాయి మనలో కలిస్తే చాలు” అంటూ ఆమెనే బలపర్చారు నాన్న.

ఇరుకుటుంబాల మధ్యా ఉన్న అంతస్తుల అంతరం వల్ల యశోద తల్లితండ్రులు మాత్రం చాలా సంశయించారు. యశోద తండ్రి గవర్నమెంట్ లో క్లర్క్ గా పనిచేసేవారు. తల్లి గృహిణి. యశోద పైన ఇద్దరి పెళ్ళిళ్ళు చేసేసరికి అసలే అంతంత మాత్రమైన ఆయన ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణించింది. అందుకే ఆయనకి మరింత సంశయంగా ఉంది.

తానూ భార్య తనకొచ్చే పెన్షన్ తో ఎలాగైనా బ్రతికేయగలం, యశోద పెళ్ళి జరిగిపోతే చాలు అనుకునేవారు.

దగ్గరవాళ్ళంతా పదే పదే చెప్పడం వల్లనూ, ' కలిగిన చోట ఇస్తే కూతురు సుఖపడుతుంది ' అన్న ఆశతోనూ సందేహంగానే ఒప్పుకున్నారు.

అలా ఏర్పాటయిన పెళ్ళి చూపుల్లో మొదటిసారి ఆమెని కలిసిన క్షణం నించీ ఆమె తన మనసుని కట్టిపడేసింది.

సన్నగా, నాజూగ్గా ఉండేది యశోద. ఆమెని చూడగానే మొదటగా ఆకట్టుకునేది ఒత్తైన, పొడవైన నల్లటి ఆమె జుట్టు. జడలో బంధించక పోతే ముఖమూ, వీపూ అంతా పరుచుకుని నడుము దాటి కిందకి సాగిపోయేది.

సింపుల్ గా, అందంగా ఏ భేషజాలు లేకుండా కనిపించిన ఆమె రూపం, అమెలోని హుందాతనం, ఆలోచనల్లో ఉన్న స్పష్టత ఇవే తనని ఆమె పట్ల ఆకర్షితుణ్ణి చేసింది.

'వివాహం సింపుల్ గా జరగాలి, కట్న కానుకల మాటే కుదరదు, ఆడపిల్ల తరపువారు ఏరకంగానూ ఇబ్బంది పడకూడదు ' అన్న కేశవ్ మాటలు అభ్యుదయ భావలతో ఉండే యశోదకి ఎంతో నచ్చాయి.

ఉన్న ఒక్క కొడుకు పెళ్ళి ఎంతో ఘనంగా జరగాలన్న ఆశ ఉన్నా కొడుకు మాటలకి, అతని విలువలకి గౌరవమిచ్చి ఊరుకున్నారు కేశవ్ తల్లిదండ్రులు.

ఇరువైపులా కుటుంబ పెద్దలకీ అన్ని విషయాలు నచ్చడంతో దగ్గరలోనే ముహూర్తం పెట్టారు.

హోంసైన్స్, న్యూట్రిషన్ సైన్స్ లో బి.ఎస్.సీ చదువుతున్న ఆమె తన చదువు పూర్తయ్యాకే పెళ్ళి ముహూర్తం పెట్టమని కోరింది.

చక్కని కంచిపట్టుచీరలో, నుదుటన మెరుస్తున్న కల్యాణ తిలకంతో తన చేయి పట్టుకుని ఏడడుగులు వేసి, కడదాకా తోడుంటానని బాస చేసి తన చిటికెనవేలు పట్టుకుని తన ఇంటికీ, జీవితంలోకీ వచ్చింది యశోద.

అది నిన్ననే జరిగినట్టుగా ఉంది ఆయన మనసులో.

అలాంటి సహచరి అంత త్వరగా తన జీవితాన్నుంచి నిష్క్రమించడమనేది అతను ఒప్పుకోలేని నిజంగా నిలబడిపోయింది గత మూడు సంవత్సరాలుగా. తలపుల నిండా నిలిచిపోయిన తన నెచ్చెలిని మర్చిపోవడం ఎలా సాధ్యం?

తన యశోద భౌతికంగా తమ మధ్యన లేదు అన్న విషయం అతనికింకా జీర్ణం కానట్టే ఉంటుంది.

ఉదయం లేస్తూనే ' యశూ, ఎక్కడికో వెళ్ళాలన్నావు ' అంటూ పక్కన మనిషి ఉన్నట్టే అనుకుంటూ తట్టి లేపడానికి ప్రయత్నించినప్పుడూ

' పారిజాతం కావాలన్నావు కదూ గార్డెన్ లోకి, ఈ రోజు తెస్తాడు మాలీ. అది పూస్తే మన బాల్కనీలోకి పరింఅలమే కాదు, పూలు కూడా చేరాలన్నావు కదా. ఎంత దూరంలో నాటమంటావో చూడు ' అంటూ మాట్లాడదాం అనుకున్నప్పుడూ..

'పిల్లల పెళ్ళిళ్ళ గురించి ఏదైనా చర్చించాలనుకున్నప్పుడూ'

' వేడిగా కఫీ కప్పు తో తన ఎదురుగా కూర్చుని కబుర్లు చెప్పే చోటు ఖాళీగా ఉన్నప్పుడూ'

ఇలా ఇప్పుడు, అప్పుడూ అని లేకుండా ఆమె తన స్మృతిపథంలో నిండిపోయి ఉంది, ఉంటుంది.

పలక మీద రాత తుడిచేసినట్టు వాటిని మర్చిపోవడం సాధ్యమా?

ఈ జన్మకి కాదు, గత జన్మ స్మృతి లేకుండా పుడితే మరు జన్మ లో సాధ్యమేమో!

ఆలోచనల్లో ఎంత సేపుండిపోయాడో తెలియనట్టుగా కూర్చుండిపోయాడు

తొలినాటి బిడియంతో, కొత్త పెళ్ళికూతురిగా తమ కుటుంబంలోకి వచ్చిన యశోద తన ఓపిక, ఒద్దిక, నిబద్ధత తో తొందరలోనే అందరి మనసులూ గెల్చుకుంది.

తన అత్తగారితో కలిసి మెలిసి పనీ, పాటా పంచుకోవడం, ప్రతీ విషయంలోనూ ఆవిడ సలహాలని అడుగుతూ, అభిప్రాయాలని గౌరవిస్తూ నడుచుకుంటూ అత్తకు తగ్గ కోడలిగా మన్నన పొందింది.

ఆడపడుచులని ఆదరిస్తూ, అతిధులని ఆహ్వానిస్తూ అందరూ కలిసేవేళలని ఆహ్లాదంగా జరిగేలా చూసుకుంటూ ఉండేది.

పరస్పర సహకారం, నమ్మకం, స్నేహం అనే పునాదుల మీద ఏర్పరుచుకున్న కేశవ్, యశోదల బంధానికి, ప్రేమకీ ప్రతీకలుగా యష్, యామిని వారి జీవితంలోకి రావడంతో ఆ కుటుంబపు సంతోషాన్ని మరింత పెంచింది.

మనవలతోనూ, పిల్లలతోనూ సంతృప్తికరమైన జీవితాన్ని గడిపిన కేశవ్ తల్లితండ్రులు ఒకరివెంట ఒకరుగా నిష్క్రమించారు.

మొదట తల్లి, ఆమె వెనుకే కొన్ని నెలల తేడాలో తండ్రి.

చిన్నప్పటినించీ తల్లితండ్రుల కనుసన్నల్లో, వారి కనుసన్నల్లో మెలిగిన కేశవ్ కి అది తట్టుకోవడం అంత సులభం కాలేదు.

అప్పుడు కూడా యశోదే అతన్ని జాగ్రత్తగా కనిపెట్టుకుని చూసుకుంటూ, అతను తేరుకునేలా చూసుకుంది. అలా ఒకరికొకరుగా బాసటగా ఉంటూ, పెద్దలు వదిలిపోయిన దూరాన్ని నెమ్మదిగా భర్తీ చేసుకుంటూ ఎదిగారు కేశవ్, యశోదలు. భర్తకి ఎంతో ధైర్యం చెప్పి, తోడుగా నిలిచిన యశోద తన బాధని మాత్రం అంత త్వరగా మర్చిపోలేకపోయింది. ముఖ్యంగా అత్తగారిని. ప్రతీ విషయానికి చేదోడు వాదోడుగా ఉండే వారిద్దరి బంధం ముగిసిపోవడం ఆమెకి చాలా బాధనే మిగిల్చింది.

దానికి తోడు కేశవ్ తన వృత్తి వ్యవహారాల్లో రోజు రోజుకీ మరింత బిజీ కావడంతో అతనికి ఇంట్లో ఉండే సమయమే దొరకడం లేదు. పిల్లలు ఎదుగుతూ తమ స్కూల్, ఇతర కార్యక్రమాలతో తమ ప్రపంచంలో తాము ఉండిపోతూ ఉండడం వల్ల యశోదకి ఏం చెయ్యాలో తెలియనట్టైపోయింది.

హఠాత్తుగా తన చేతిలో చాలా సమయం ఉన్నట్టూ, దాని ఏం చేసుకోవాలో తెలియనట్టూ అయిపోయింది ఆమెకి. పెళ్ళి అయినప్పటినించీ అందరి పనుల మధ్యనా గిలకలా తిరుగుతూ ఎన్నో పనులతో, బాధ్యలతో తలమునకలుగా ఉండే యశోదకి ఆ తీరిక భరించలేనంత భారమైపోయింది.

ఆ విషయాన్ని మొదట గుర్తించినది కేశవే.

ఏదో తెలియని నిరుత్సాహంతో, కళ తప్పినట్టుగా కనిపిస్తున్న భార్యని గమనించాడు ఆయన. ఒక రోజు సాయంత్రం టీ సమయంలో అదే మాట చెప్పాడు ఆమెతో.

" యశూ, నువ్వు కూడా నీకంటూ ఒక వ్యాపకాన్ని ఏర్పరుచుకుంటే బావుంటుంది కదా, ఆలోచించు. ఇదివరకటికంటే నీకు కాస్త సమయం ఉంది కదా, దాన్ని ఊరికే వృధా చేసుకుంటే ఏమొస్తుంది? అమ్మా, నాన్నల పనులేమీ లేవు, పిల్లలూ వాళ్ళ పనుల్లో బిజీగా ఉంటున్నారు కదా" అన్నాడు.

" నా మనసులోనూ, జీవితంలోనూ ఖాళీ వచ్చిన మాట వాస్తవమే, అది మీరు గుర్తించడం కూడా నాకు సంతోషంగా ఉంది. దీన్ని పూరించుకోవడానికి ఏం చేస్తే బావుంటుందా? అని గత కొద్ది కాలంగా నేను కూడా ఆలోచిస్తున్నాను. కానీ ఏం చెయ్యాలో తెలియడం లేదు" అంది ఆమె

" నువ్వు చాలా తెలివైనదానివి, చురుకైన దానివి. చదువుకున్నదానివి. మన కుటుంబంలో ఇప్పుడు మరొకరు అర్జంట్ గా ఉద్యోగం చేసి, సంపాదించవలసిన అవసరం లేదు కనక నువ్వు ఏదైనా చదువుకుంటానంటే చదువుకోవచ్చు కదా, లేదా ఏదైనా సేవా సంస్థలో వాలంటీర్ గా. నీకు ఉద్యోగం చెయ్యాలని ఉంటే అదైనా సరే. పూర్తిగా నీఇష్టం. కానీ రోజుకు కొన్ని గంటలైనా ఏదైనా పనిలో బిజీగా ఉంటే నీకు మంచిదని నా అభిప్రాయం" అన్నారాయన.

భర్త మాటలకి ఆలోచనలో పడింది యశోద.

కాలేజీ చదువయ్యాకా, పెళ్ళి అయినప్పటినించీ ఇప్పటివరకూ, ఇన్నేళ్ళల్లోనూ ఎప్పుడూ తనదనుకున్న ఈ ప్రపంచం దాటి బయటకు వెళ్ళింది లేదు. ఇప్పుడు ఒక్కసారిగా చెయ్యలాంటే తన వల్ల అవుతుందా? ఏం చెయ్యగలదు?

భర్త చెప్పినట్టు చదువుకోవడా, ఉద్యోగమా, వాలంటరీ పనా? ఇలా అనుకోవడం మొదలుపెట్టింది.

" పోనీ మొదట దూరవిద్యద్వారా ఏదైనా చదువుకోవడంతో మొదలుపెట్టు. కాలేజీలో చేరుతానన్నా సరే, నీ ఇష్టం" అన్నాడు కేశవ్.

నవ్వింది ఆయన మాటలకి.

" కాలేజ్ వద్దులెండి, మొదట దూరవిద్యలో ఇంటీరియర్ డిజైనింగ్ లాంటిదేదైనా ప్రయత్నిస్తాను" అంది ఆవిడ.

" వెరీ గుడ్, నీ హోం సైన్స్ చదువుకి సరిగ్గా సరిపోతుంది" అన్నాడు ఆయన ప్రోత్సహిస్తూ.

అలా మొదలైన ఆమె చదువు తర్వాత రెండేళ్ళల్లో ఇంటీరియర్ డిజైనింగ్, గార్డెనింగ్, హార్టికల్చర్, లాండ్స్కేపింగ్ లాంటి విషయాల్లో రక రకాల డిప్లొమాలు చేసి, సర్టిఫికెట్లు పొందింది.

ఆ ప్రయత్నాల్లో భాగంగా వచ్చిన చిన్న చిన్న కన్సల్టింగ్ ప్రాజెక్ట్ లు రావడం, కొత్త వ్యక్తులతో పరిచయాలు ఏర్పడటం ఆమెకెంతో నచ్చసాగాయి.

తనకి నచ్చిన వేళల్లో, తనకి వీలుని బట్టి పని చేసుకోగలిగే సౌలభ్యం ఉండడం ఆమెకి చాలా నచ్చిన విషయం.

చేపట్టిన ఏపనినైనా చాలా తక్కువ కాలంలోనే, చక్కగా చేసే ఆమెకి మంచిపెరు రావడం పెద్ద కష్టమేమీ కాలేదు. తన వీలు మేరకే పని చేసినా ఆమె పని తీరు అత్యద్భుతంగా ఉండడంతో ఆమెకి చాలా త్వరలోనే పని ఎక్కువైంది. దాంతో ఇద్దరు అసిస్టెంట్స్ ని పెట్టుకుంది ఆవిడ.

ఆమె అలా బిజీగా ఉండడం, తనకి నచ్చిన రంగాల్లో పని చేసుకోగలగడం ఆమెకీ, కేశవ్ కి కూడా చాలా తృప్తిగా అనిపించడం మొదలైంది..

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments